ప్రజాశక్తి

గురువారం 23 ఫిబ్రవరి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

అత్తెసరు లక్ష్యంలోనూ నిర్లక్ష్యం

- నామమాత్రంగా ధాన్యం కొనుగోలు
- లక్ష్యంలో సగమైనా పూర్తి చేయని యంత్రాంగం
- అయినకాడికి అమ్ముకుంటున్న రైతులు



ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె) ద్వారా ధాన్యం కొనుగోలు మొక్కుబడిగా జరుగుతోంది. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.67 లక్షల ఎకరాల్లో వరి సాగవగా దాదాపు 5 లక్షల టన్నులు ధాన్యం ఉత్పత్తి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన ధాన్య సేకరణ లక్ష్యం మాత్రం 37 వేల మెట్రిక్ టన్నులే. అయినా దీన్నీ పూర్తి చేయలేకపోయారు. జిల్లాలోని 14 మండలాల ద్వారా ఇప్పటి వరకు కేవలం 1500 మంది రైతుల నుంచి 12,200 వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్నే కొన్నారు. ఇందులో 'ఎ' గ్రేడ్ 8 వేల టన్నులు, సాధారణ రకం 4,200 టన్నులు కొనుగోలు చేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గతేడాది ఇదే సమయానికి దాదాపు రెండు లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఈ ఏడాది కేవలం 12,200 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం గమనార్హం.

ధాన్యం సేకరణకు ప్రభుత్వం అతి తక్కువగా లక్ష్యం నిర్ధేశించినా అధికారులు చొరవచూపి లక్ష్యం నెరవేర్చేందుకు తగిన కృషి జరగలేదనే విమర్శలు వస్తున్నాయి. ఉత్పత్తి లక్ష్యం కంటే ధాన్య సేకరణ లక్ష్యం తక్కువగా నిర్ధేశించడంపై అవసరాన్ని బట్టి లక్ష్యం పెంచుతారని డిసెంబరు ఆఖరు వరకూ అధికారులు చెబుతూ వచ్చారు. కానీ నిర్ధేశించిన లక్ష్యంలో సగం కూడా పూర్తికాకపోవడంతో ఇక ఈ సీజన్‌కు ఇంతేనని సరిపెట్టుకోవడం రైతుల వంతైంది. జిల్లా మొత్తం మీద 14 మండలాల్లో ఈ ఏడాది పొన్నూరు మండలంలో అత్యధికంగా 2950.8 టన్నుల వరకు కొనుగోలు చేశారు. అత్యల్పంగా గుంటూరు తూర్పు మండలంలో కేవలం 13.36 టన్నులు మాత్రమే కొన్నారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు దాదాపుగా పూర్తికావచ్చినా లక్ష్యంపై జిల్లా అధికారులు దృష్టి సారించలేదు. బహిరంగా మార్కెట్‌లో ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉండటం వల్ల రైతులు మార్కెట్‌లో నేరుగా అమ్ముకున్నారని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆంక్షల వల్లే ఆర్‌బికేలకు వెళ్లడం లేదని రైతులు చెబుతున్నారు.

ఈ ఏడాది మద్దతు ధర కంటే క్వింటాళ్‌కు రూ.100 తక్కువైనా సరే ఆంక్షలు, తేమ శాతం, సొమ్ములు సకాలంలో రాకపోవడం, రవాణా ఛార్జీలు, గోతాల సమస్యలతో చాలా మంది రైతులు పొలాల్లోనే ధాన్యం విక్రయించారు. కొంత మంది మాత్రం కుప్పలు వేశారు. రబీ పంటలు సాగు పూర్తయిన తరువాత కుప్పలను నూర్పిడి చేసి విక్రయించుకునేలా సిద్ధమయ్యారు. ధాన్యం మద్దతు ధర ఈ ఏడాది క్వింటాళ్‌కు 'ఎ' గ్రేడు రూ.2060 కాగా, సాధారణ రకం రూ.2040 ఉంది. జిల్లాలో ఎక్కువ మంది రైతులు 'ఎ' గ్రేడు ధాన్యం పండిస్తున్నారు. వరి సాధారణ రకం తక్కువగా సాగు చేశారు. మిల్లర్లు తేమశాతం నిబంధనతో ఆంక్షలుపెట్టడం వల్ల రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు నానా తంటాలు సడ్డారు. గతేడాది ఎదురైన ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది ధాన్యం రైతులు అయిన కాడికి విక్రయించుకున్నారు.

తాగునీరు లేదన్నందుకు దాడి

గండిగనుమలలో గిరిజన యువకునిపై వైసిపి నాయకుని దౌర్జన్యం

ప్రజాశక్తి - బొల్లాపల్లి



శ్రీనునాయక్ ఇంటి ఎదుట దౌర్జన్యానికి దిగిన వైసిపి నాయకుని అనుచరులు

తమ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా పరిష్కరించడం లేదని ప్రశ్నించిన గిరిజన యువకుడిపై అధికార పార్టీ నాయకుడు దుర్భాషలాడి, అనుచరులతో దౌర్జన్యం చేయించిన ఘటన మండలంలోని గండిగనులలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుని కథనం ప్రకారం.. గ్రామంలోని సచివాలయం వద్ద ఇటీవల సమావేశం నిర్వహించగా ఎంపిపి కుమారుడు, వైసిపి మండల మాజీ కన్వీనర్ అయిన బత్తిన గురవయ్య మాట్లాడారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి లేదని, బోర్లు వేయించడంతో నీరు పుష్కలంగా అందుతోందని చెప్పారు. అయితే ఇదంతా అసత్యమని, గ్రామంలో నెల రోజులుగా తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని పేర్కొంటూ గ్రామానికే చెందిన శ్రీను నాయక్ బుధవారం సోషల్ మీడియా వేదికగా ఖండించాడు. బోర్లు వేయించారేగాని వాటి నుండి నీరు రావడం లేదని, నిరుపయోగంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇది చూసిన గురవయ్య... శ్రీను నాయక్‌కు ఫోన్ చేసి అసభ్యంగా దూషించాడు. 20 మంది వరకు అతని అనుయాయులను శ్రీనునాయక్ ఇంటిపైకి పంపించి దౌర్జన్యం చేయించారు. ఇది గమనించిన స్థానికులంతా వారిని అడ్డుకుని నిలదీయడంతో వెళ్లిపోయారు. దీనిపై బాధితుడు శ్రీనునాయక్ బండ్లమోటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, గతంలో ఒక ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేసేవారని, అయితే బిల్లింగ్‌లో అవినీతి వల్ల ఇప్పుడు చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. సమస్యను చెప్పినందుకు దాడులు దారుణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా బొల్లాపల్లి మండలంతోపాటు ప్రత్యేకించి గండిగనుమలలో తాగునీటి ఇక్కట్లపై ప్రజాశక్తిలో 'ఎళ్లు గడుస్తున్నా నీళ్ల గండమే' శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.

కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా రేపు ధర్నాలు : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టి ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ మండల, పట్టణ కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించే ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్రం తీరని అన్యాయం చేసిందని, ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలు, విశాఖ రైల్వేజోన్, కడపఉక్కు, పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయించలేదని పేర్కొన్నారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీకి గత బడ్జెట్ కంటే 30 శాతం నిధులు కోత విధించారని, దీనికి తోడు యువతకు ఉపాధి కల్పించే చర్యలు చేపట్టలేదని తెలిపారు. సంక్షేమ రంగానికి, వ్యవసాయానికి, ధాన్యం సేకరణకు, ఎరువుల సబ్సిడీకి నిధులు కేటాయింపులు తగ్గించారని, అదాని గ్రూప్ షేర్ల కుంభకోణం వల్ల ప్రపంచంలో దేశం పరువు మంటగలిసిందని విమర్శించారు. షేర్ల కుంభకోణంలో అదానిని అరెస్టు చేయాలని, కేంద్ర ప్రభుత్వం వెంటనే తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఉద్రిక్తంగా మృతదేహం తరలింపు

- నరసరావుపేట నుండి ప్రదర్శనగా వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- కొద్దిసేపు వాగ్వాదం, తోపులాట - రొంపిచర్లలో రాస్తారోకో
- పూర్తయిన వెన్నా బాలకోటిరెడ్డి అంత్యక్రియలు

ప్రజాశక్తి - నరసరావుపేట, రొంపిచర్ల

తుపాకీ కాల్పులకు గురైన టిడిపి రొంపిచర్ల మండల అధ్యక్షులు, మాజీ ఎంపిపి వెన్నా బాలకోటిరెడ్డి మంగళవారం రాత్రి మృతి చెందారు. అయితే గుంటూరు నుండి ఆయన సొంతూరుకు మృతదేహం తరలింపు పలు ఉద్రిక్తలకు దారితీసింది. మృతదేహాన్ని అంబులెన్స్‌లో తొలుత గుంటూరు నుండి నరసరావుపేటలోని టిడిపి కార్యాలయానికి తీసుకొచ్చి అక్కడ నివాళు లర్పించాక ప్రదర్శనగా లింగంగుంట్ల, అల్లూరివారిపాలెం, ఇక్కుర్రు, అన్నవరం, రొంపిచర్ల,

2లో



నరసరావుపేటలో అంబులెన్స్‌ను అడ్డుకోవడంతో పోలీసులు, టిడిపి శ్రేణుల వాగ్వాదం



మహిళను పోలీసులు, అధికారుల సమక్షంలో కుటుంబానికి అప్పగిస్తున్న ట్రస్ట్ సభ్యులు

తొమ్మిదేళ్ల తర్వాత కుటుంబం చెంతకు మహిళ

ప్రజాశక్తి - దుగ్గిరాల

భర్త చనిపోవడంతో షాక్‌కు గురైన మహిళ ఇంటి నుండి తప్పిపోయి తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ కుటుంబం చెంతుకు చేరారు. మండలంలోని రేవేంద్రపాడుకు చెందిన చిట్టిబొమ్మ ఝాన్సీ భర్త 2014లో రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఇది తట్టుకోలేని ఆమె క్రమంగా మతిస్థిమితం కోల్పోయారు. కొన్నాళ్ల తర్వాత పొలానికి వెళుతున్నట్లు చెప్పి వెళ్లిన ఆమె మళ్లీ ఇంటికి రాలేదు. కుమారుడు రాజేశ్ పలు విధాలుగా వెదికినా ఫలితం దక్కలేదు. కాలినడకన వెళ్లిందో.. రైలు ద్వారానో, కాలి నడకనో తెలీదుగాని కేరళలోని కొల్లంకు చేరారు. అక్కడ రోడ్ల వెంట తిరుగుతున్న ఆమెను గాంధీ భవన్ ఇంటర్నేషనల్ ట్రస్ట్ (కొల్లం) వారు చేరదీశారు. ఇటీవల కాలంలో కొంత వరకు కోలుకున్న ఆమెకు పాత జ్ఞాపకాలు గుర్తొచ్చాయి. ఆమె చెప్పిన వివరాల ఆధారంగా కుమారుడు రాజేశ్ ఫోన్ నంబర్‌కు ట్రస్ట్ సభ్యులు ఫోన్ చేశారు. వివరాలు చెప్పి వీడియో కాల్ చేయగా ఒకర్నోకరు గుర్తుపట్టుకుని మాట్లాడుకున్నారు. దీంతో ఆమెను దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌కు బుధవారం తీసుకురాగా కుమారుడు పలు ధ్రువపత్రాలను తహశీల్దార్, పోలీసుల సమక్షంలో ఇవ్వడంతో ట్రస్ట్ సభ్యులు ఆమెను కుటుంబానికి అప్పగించారు.



గడ్డివాము దగ్ధం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని సుమారు 3 ఎకరాల గడ్డివాము దగ్ధమైన ఘటన మండలంలోని ఇరుకుపాలెంలో బుధవారం చోటు చేసుకుంది. ఇరుకుపాలానికి చెందిన కౌలు రైతు నల్లగొండ వెంకటరావు, అదే గ్రామంలోని పొలాన్ని కౌలుకు తీసుకుని వరి, మిరప పంటలు వేస్తుంటాడు. దీంతో పాటు పశుపోషణ కూడా చేస్తుంటాడు. కౌలు పొలంలో ఉన్న వరిని నూర్పి.. గ్రామంలోని ఆర్అండ్‌బి రోడ్డు వెంట ఉన్న హెచ్‌పి గ్యాస్ గోడౌన్ పక్కన గడ్డి వాము వేశాడు. బుధవారం తెల్లవారుజామున బీట్‌లో తిరుగుతున్న కాని స్టేబుల్ ఖాదర్‌మస్తాన్‌వలి, హోంగార్డు సుభాని అటుగా వెళుతుండగా గడ్డి వాములో మంటలు చెల రేగుతుండడం గమనించారు. ఈ మేరకు ఫైర్‌స్టేషన్‌కు సమాచారమివ్వడంతో ఫైర్ ఇంజన్ వచ్చి మంటలార్పింది. సుమారు రూ.35 వేలు నష్టం వాటిల్లిందని కౌలు రైతు వెంకటరావు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



స్వాతంత్ర్య ఉద్యమంలో కన్నెగంటికి ప్రత్యేక స్థానం

ప్రజాశక్తి-గుంటూరు

పల్నాటి వీరుడు కన్నెగంటి హనుమంతు 101వ వర్ధంతిని పురస్కరించుకొని చుట్టుగుంటలోని ఆయన విగ్రహానికి బుధవారం నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యే మద్దాళిగిరిధర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో గుంటూరు జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందని, జిల్లా నుండి స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతో మంది పోరాడి తమ ప్రాణాలను సైతం త్యజించి, స్వాతంత్ర్యాన్ని సాధించారని, అటువంటి వారిని భావి తరాలు మరచిపోకుండా, వారి త్యాగాలను గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కాండ్రుకుంట గురవయ్య, అచ్చాల వెంకటరెడ్డి, అందుగుల సంతోష్, షేక్ రోషన్ పాల్గొన్నారు.

సచివాలయం జిల్లా మహిళా పోలీసు వెల్ఫేర్ అధ్యక్ష, కార్యదర్శులుగా దుర్గ, గౌసియా బేగం



ఎంవిఎన్.దుర్గ, ఎం.డి గౌసియా బేగం

ప్రజాశక్తి - చేబ్రోలు :ఏపి గ్రామ /వార్డు సచివాలయ జిల్లా మహిళ పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ది గుంటూరు జిల్లా అడహాక్ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గుంటూరు జిల్లా మహిళా పోలీస్ అడహాక్ కమిటీ గుంటూరు జిల్లా అధ్యక్షురాలిగా చేబ్రోలు మండలం చేబ్రోలు 1వ సచివాలయం చెందిన మహిళా పోలీసు ఎం.వి.యన్. దుర్గ , జనరల్ సెక్రటరీగా తాడేపల్లి మండలం ఎండి గౌసియా బేగం, కోశాధికారిగా యం.సుమతి, వైస్ ప్రెసిడెంట్ గా, డి. ఉషా రాణి, వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా ఎ .రాధిక, జాయింట్ సెక్రటరీలగా ఐ .శైలజ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి .ప్రగతీ, కార్య వర్గ సభ్యులను నూతనంగా ఎన్నుకోవడం జరిగిందని అధ్యక్షులు దుర్గ తెలిపారు. మహిళ పోలీస్ వెల్ఫేర్ సంఘం రాష్ట్ర నాయకులు యస్. మహాలక్ష్మీ స్టేట్ ప్రెసిడెంట్, డి. మధులత స్టేట్ జనరల్ సెక్రటరీ, యం.అరుణ స్టేట్ అడిషనల్ జనరల్ సెక్రెటరీ, డి.నళిని స్టేట్ ట్రెజరరుగా నియమితులైయ్యారు.

డీఎస్ఏ స్టేడియంలో స్పోర్ట్స్ డెక్ ప్రారంభం



స్పోర్ట్స్ డెక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

పల్నాడు జిల్లా: పల్నాడు జిల్లాలోని నరసరావుపేట డీఎస్ఏ స్టేడియంలో బుధవారం సాయంత్రం స్పోర్ట్స్ డెక్ (ప్రైవేట్ స్పోర్ట్స్ ఎరీనా) ను జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు ప్రారంభించారు.కంజుల రామలింగారెడ్డి (శ్రవంత్) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కారసాని శ్రీనివాస్ రెడ్డి భారత క్రికెట్ జట్టు అండర్ -19 వైస్ కెప్టెన్ రషీద్, పల్నాడు జిల్లా అభివద్ధి మండలి చైర్మన్ మిట్టపల్లి రమేష్ ,ఎంఆర్ఓ రమణ నాయక్ ,మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, షేక్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఖాజావలి, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనీఫ్, కె.పి రంగారావు,నిడమనూరి సురేంద్ర, కంజుల రామకోటి రెడ్డి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సుజాత పాల్‌లు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో క్రీడలకు అత్యంత ప్రాధానమిస్తున్నామన్నారు. సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్రిక్తంగా మృతదేహం తరలింపు

(మొదటి పేజీ తరువాయి)



రొంపిచర్లలో రాస్తారోకో చేస్తున్న టిడిపి శ్రేణులు

కొనకంచివారిపాలెం మీదుగా అలవాలకు తీసుకెళ్లాలని నాయకులు భావించారు. అయితే ఇందుకు పోలీసులు అంగీకరించలేదు. అంబులెన్స్‌ను నరసరావుపేటలో గుంటూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం వైపు రాకుండా పట్టణంలోకి ప్రవేశించే గుంటూరు - కర్నూలు రహదారిపై పట్టణ శివారులోని ఎస్ఆర్‌కెటి కాలనీ వద్ద అడ్డుకున్నారు. అప్పటికే అక్కడకు టిడిపి శ్రేణులు భారీగా చేరాయి. అంబులెన్స్‌ను అనుమతించాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఇతర నాయకులు, కార్యకర్తలు పట్టుబట్టడంతో పోలీసులతో వాగ్వాదం, తోపులాట తలెత్తాయి. విషయం తెలుసుకున్న పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ జి.బిందుమాధవ్ ఘటనా స్థలికి చేరుకున్నారు. టిడిపి నాయకులతో మాట్లాడి మృతదేహాన్ని గుంటూరు - కర్నూలు మార్గంలో సంతమాగులూరు మీదుగా అలవాలకు పంపించారు.

నాలుగు గంటలపాటు రాస్తారోకో

ఇదిలా ఉండగా వెన్నా బాలకోటిరెడ్డి మృతదేహం ఉన్న అంబులెన్స్‌ను నరసరావుపేటలో పోలీసులు అడ్డుకున్నారని తెలిసిన రొంపిచర్ల మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఆగ్రహానికి గురయ్యారు. అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారిపై రొంపిచర్లలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రాస్తారోకోకు దిగడంతో వాహనాలు భారీగా నిలిచాయి. అంబులెన్స్‌ను వదిలేశారని తెలిసేదాక సుమారు 4 గంటల పాటు రహదారిపైనే బైటాయించారు. గ్రామానికి మృతదేహం చేరిన అనంతరం అంతిమ యాత్ర నిర్వహించి అంత్యక్రియలు పూర్తి చేశారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్, ఎమ్మెల్సీ తదితరులు

రూ.2.20 కోట్లతో చుట్టుగుంట అభివృద్ధి

ప్రజాశక్తి-గుంటూరు:గుంటూరు నగర ఖ్యాతిని చాటేలా చుట్టగుంట జంక్షన్ అభివృద్ధి చేయనున్నామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అన్నారు. బుధవారం రూ.2.20 కోట్లతో చుట్టగుంట జంక్షన్ అభివృద్ధికి చేపట్టనున్న పనులకు ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ చంద్రగిరి ఏసురత్నంలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగరంలో జంక్షన్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ నగర అభివృద్ధిపై సిఎం ప్రత్యేక దృష్టి సారించారన్నారు. గుంటూరు నగరంలోకి వచ్చే ప్రధాన జంక్షన్ చుట్టగుంట అభివృద్ధి మోడల్‌గా ఉండాలన్నారు. జంక్షన్‌తో పక్కన ఉన్న వాకింగ్ ట్రాక్, చెరువుని కూడా అభివద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్.సజీల, కార్పొరేటర్లు అడకా పద్మావతి, షేక్.రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, కాండ్రగుంట గురవయ్య, అందుగుల సంతోష్, జిఎంసి ఎస్.ఈ. భాస్కర్, ఈఈ. సుందర్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఆశయ సాధకులు గృహసారథులు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

ప్రభుత్వ పథకాలు సమగ్రంగా ప్రజలకు అందుతున్నాయా లేదో గృహసారధులు, సచివాలయ కార్యదర్శులు పరిశీలించి రికార్డు చేస్తారని, సీఎం ఆశయ సాధకులు గృహసారధులేనని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. బుధవారం పెదనందిపాడు ఉప మార్కెట్ యార్డులో పత్తిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ ఖాసిం పీరా ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు చెరుకూరి సాంబశివరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన గృహ సారధులు, సచివాలయాల కార్యదర్శుల సమావేశంలో సుచరిత మాట్లాడారు. సచివాలయ వ్యవస్థతో మరిన్ని సేవలు అందించేందుకు గృహసారధులను, సచివాలయ కార్యకర్తలను తీసుకువచ్చిందని వీరు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి పథకాలు వారికి అందుతున్నాయో లేదో తెలుసుకొని రికార్డ్ చేసి ప్రభుత్వ సహకారంతో అందరికీ పథకాలు అందేటట్లు కృషి చేస్తారన్నారు.ఈ సమావేశంలో ఎంపీపీ హేప్సిబా, ఉప ఎంపీపీలు కాసింబి, సాంబశివరావు, ఏపీ పాలెం సొసైటీ అధ్యక్షులు కూరేటి భూషయ్య, ఎంపీటీసీ మాలతి, సర్పంచ్ దాసరి పద్మారావు ,కాకుమాను జడ్పిటిసి గుల్జార్ బేగం, కట్రపాడు సర్పంచి అనంత ప్రసాద్, వరగాని ఉప సర్పంచ్ దిరిశాల సురేష్ లుపాల్గొన్నారు.

కొనసాగుతున్న పైప్‌లైన్ పనులు

- శుక్రవారం నుండి యధావిధిగా తాగునీరు



ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక నెహ్రూ నగర్ నుండి హెచ్‌ఎల్ఆర్ వరకూ ప్రస్తుతం ఉన్న 800 డయా పైప్‌లైన్ స్థానంలో ఏర్పాటు చేసిన 900 డయా పైప్‌లైన్ అనుసంధాన పనులు నిర్దేశిత గడవులోగా పూర్తి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అధికారుల్ని ఆదేశించారు. బుధవారం కమిషనర్ సంజీవయ్య నగర్ రైల్వే క్రాసింగ్ గేటు వద్ద, అరండల్ పేట హెచ్.ఎల్.ఆర్. వద్ద జరుగుతున్న ఇంటర్ కనెక్షన్ పనులు తనిఖీ చేసి, పనుల వేగవంతంపై ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలకు మెరుగైన తాగునీరు అందించేందుకు, రానున్న వేసవిలోగా పైప్ లైన్లపై ఏర్పడిన లీకుల మరమ్మతులను పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారన్నారు. అనుసంధానం, లీకుల మరమ్మతు పనులు నాణ్యతగా ఉండాలని, నిర్లక్ష్యంగా ఉంటే కాంట్రాక్టర్‌తో పాటు పర్యవేక్షణ అధికారులపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. లీకుల వలన పలు ప్రాంతాల్లో తాగునీరు వృధా అవ్వడం వలన శివారు ప్రాంతాలకు సమగ్రంగా ఇవ్వలేకపోతున్నామని, అటువంటి లీకులను గుర్తించి, ప్రస్తుత షట్‌డౌన్ సమయంలోనే మరమ్మతు పనులు పూర్తి చేసేలా ఏ.ఈ.లు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వేసవిలో నగరంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పర్యట నలో ఎస్.ఈ. భాస్కర్, ఈ.ఈ.లు శాంతిరాజు, సుందర్రామిరెడ్డి, డి.ఈ.ఈ. లు శ్రీనివాసరెడ్డి, మహ్మద్ రఫిక్, ఏ.ఈ.లు సేతుబాబు, సునీల్ కుమార్ పాల్గొన్నారు.



చెక్కు అందచేస్తున్న కమిషనర్

కార్మికురాలి కుటుంబానికి పరిహారం అందజేత

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజారోగ్య విభాగంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తూ మరణించిన కర్రా మరియమ్మ కుటుంబానికి నగర కమిషనర్ కీర్తి చేకూరి పరిహారం చెక్కును బుధవారం అందచేశారు. మరియమ్మ కుమార్తె ప్రసన్నకుమారికి రూ.2 లక్షల చెక్కును అందజేసి మాట్లాడుతూ నగరపాలక సంస్థలోని కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. అలాగే నగరపాలక సంస్థ నుండి అందాల్సిన పరిహారాలు, పి.ఎఫ్. కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబందిత విభాగ సూపరిండెంట్లను ఆదేశించామని తెలిపారు.

కెఎల్‌పిలో బాడెన్ పావెల్ జయంతి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో బుధవారం ప్రపంచ స్కౌట్స్ ఉద్యమ వ్యవస్థాపకుడు లార్డ్ బాడెన్ పావెల్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ వై.రధినీచౌదరి, ఏఒ వెంకటరావు, విద్యార్థులు స్కౌట్స్ పతాకాన్ని ఎగురవేసి, పావెల చిత్రపటానికి నివాళులర్పించారు. ఇందులో భాగంగా డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పావెల సందేశం సాహసమే శ్వాసగా, సేవే పరమావధిగా కలిసి ప్రపంచాన్ని మారుద్దామని అనేది స్కౌట్స్ అండ్ గైడ్స్ వల్లనే సాధ్యమౌతుందన్నారు. కావున కెఎల్‌పిలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను స్థాపించి విద్యార్థుల్లో సేవాభావాన్ని, దేశభక్తిని పెంపొందించి అనేక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనే విధంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాగార్జునా ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ కె.బసవపున్నయ్య విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

నూతన భవనంలోకి మహాత్మా గాంధీ ఆశ్రమం

ప్రజాశక్తి- తెనాలి

స్థానిక కొల్లా వారి వీధిలో ఇప్పటి వరకూ నిర్వహించిన మహాత్మా గాంధీ సేవా శాంతి ఆశ్రమాన్ని బుర్రిపాలెం రోడ్డులో నూతనంగా నిర్మించిన భవనంలోకి బుధవారం మార్చారు. నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి ఆధ్వర్యంలో ఆశ్రమంలోని గాంధీ విగ్రహంతోపాటు పలువురు ప్రముఖుల విగ్రహాలను ఊరేగింపుగా తరలించారు. అలాగే ఆశ్రమంలో సేదతీరుతున్న వృద్ధులను కూడా తరలించి వారికి భోజనాన్ని సమకూర్చారు. ఈ సందర్భంగా నూతన భవన నిర్మాణానికి సహకరించిన దాతలకు రామలింగాచారి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎం.రమణయ్య, ఎం.సంగిరెడ్డి, కే బాపనయ్య చౌదరి, ఎం.ధనుంజయరావ్, ఎం.శేషాచలం పాల్గొన్నారు.

ఒకే రోజు 30 జగనన్న ఇళ్లకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి -దుగ్గిరాల

మండలంలోని చుక్కపల్లివారి పాలెం గ్రామంలో బుధవారం ఉదయం జగనన్న కాలనీలో 30 మంది లబ్ధిదారులు ఇళ్లకు శంకుస్థాపనలు నిర్వహించారు. సాయంత్రం నుండి శ్రమ దినాలు(ఈస్టర్ పండుగకు ముందు 40 రోజులు ఉపవాసాల ప్రారంభమయ్యాయి) ఈ సమయంలో ఎటువంటి శుభకార్యాలు చేపట్టారు. దీనితో దళితులు ఎక్కువగా ఉన్న చుక్కపల్లి వారి పాలెం గ్రామంలో జడ్పిటిసి మేకతోటి అరుణ,తహశీల్దార్ కే. మల్లేశ్వరి ,ఎంపీడీవో కుసుమ శ్రీదేవి, హౌసింగ్ ఏఈ ఎస్కే యం షా లు ఆ గ్రామం వెళ్లి లబ్ధిదారులను ప్రోత్సహించి శంకుస్థాపనలకు శ్రీకారం చుట్టారు.

ప్రజలను చైతన్య పరిచేందుకు శ్రీశ్రీ కవిత్వం

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లిలోని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వల్లభాపురం వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఉండ వల్లిలో రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రెడ్‌బుక్ డే సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యాజి పాల్గొని మాట్లాడుతూ కష్ట జీవికి ఇరువైపులా నిలబడే వాడు కవి అన్న శ్రీశ్రీ తన జీవితాంతం ప్రజల పక్షాన నిలబడ్డారని అన్నారు. ప్రజలు సమిష్టిగా, సమైక్యంగా కదిలినప్పుడు సమాజంలో కచ్చితంగా మార్పు వస్తుందని చెప్పారు. ప్రజల సొమ్మును స్వాహా చేస్తున్న కార్పొరేట్ శక్తులు ప్రబలుతున్న కాలంలో ప్రజలను చైతన్య పరిచేందుకు శ్రీశ్రీ కవిత్వం మరింతగా దోహద పడుతుందన్నారు. మహా ప్రస్థానంలోని గీతాలు ,కవితలు నేటి పరిస్థితికి చక్కగా అద్దం పడతాయన్నారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ అధ్యయనం సమాజ మార్పుకు ఒక సాధన మని చెప్పారు. చాంబర్ ఆఫ్ కామర్స్ మంగళగిరి అధ్యక్షులు వీసం వెంకటేశ్వర రావు మాట్లాడుతూ శ్రీశ్రీ కవితలు నేటి యువతరానికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో సుందరయ్య సాంస్కృతిక సేవా సమితి కన్వీ నర్ జి.సుబ్బారెడ్డి, సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ సభ్యులు సిహెచ్ సుందర్రావు, ఎస్ కే ఎర్రపేరు సంకురు ఇమాన్యుల్ రాజు, నాయకులు పి.రాఘవులు వి.పార్థసారథి గుంటక శ్రీనివాసరెడ్డి, తుమ్మపూడి శివయ్య, వి.మస్తాన్‌రావు, పాగోలు శ్రీనివాసరావు, రావలస కామరాజు పాల్గొన్నారు.


మహాప్రస్థానంలోని కవితలను విశ్లేషణ చేస్తున్న సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యాజి

గల్లంతైన యువకులు మృతి

ప్రజాశక్తి-నకరికల్లు




మండలంలోని కండ్ల కుంట వద్ద గల గుం టూరు బ్రాంచ్ కెనా ల్‌లో మంగళవారం గల్లంతైన ఇద్దరు యువకులు ముస్తఫా షరీఫ్, గోపి మృతి చెందారు. ఈ విషయాన్ని పోలీసులు బుధవారం తెలిపారు. యువకుల మృతదేహాలు కెసిపి నాలుగో ప్లాంట్ వద్ద దొరికినట్లు చెప్పారు. మృతిని అన్న యాకూబ్ షరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

7గురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - తుళ్లూరు

తుళ్లూరు లోని తూర్పు వీధిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.4,590 నగదు, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సోమేశ్వరరావు తెలిపారు.

ప్రాంగణ ఎంపికల్లో 'తిరుమల' విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-నరసరావుపేట



మండలంలోని జొన్నలగడ్డ పరిధిలోని తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో గత ఏడాది డిసెంబర్ నెలలో సూథెర్ ల్యాండ్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ చాటిన 56 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కంపెనీ ప్రతినిధులు ప్రకటించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి. నారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ కళాశాల నుండి ఉద్యోగాలకు ఎంపికైన వివిధ బ్రాంచ్ లకు చెందిన విద్యార్థులకు రూ 2.50 లక్షలు వార్షిక వేతనం కంపెనీ ఇవ్వనున్నట్లు పేర్కొ న్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలకు సంబంధించిన ప్రత్యేక శిక్షణ తరగతుల నేప థ్యంలో ప్రఖ్యాతిగాంచిన బహుళ జాతి కం పెనీలలో తమ కళాశాల విద్యార్థులు ఉద్యో గాలు సాధించారన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, కళాశాల వైస్ ఛైర్మన్ బత్తిన నాగేశ్వరరావు, కోశాధికారి దండా బ్రహ్మానందం అభినందించారు. కళాశాల ప్లేస్మెంట్ అధికారి ఏం సాంబశివరావు, అసిస్టెంట్ ప్లేస్మెంట్ అధికారి ఎం.శ్రీకాంత్, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం

ప్రజాశక్తి-ఫిరంగిపురం

సుమారు అరవైఏళ్ళు పైబడిన వృద్ధురాలు క్రీస్తు నగర్ శివారులోని దేనాపూర్ కాలేజీ ప్రహరీ గోడ పక్కన చని పోయింది, మృతదేహం బాగా కుళ్ళిపోయి గుర్తుపట్ట లేని స్థితిలో ఉంది. మృతురాలు సుమారు 5 అడుగుల ఎత్తు ఉండి, ఆకుపచ్చ రంగు జాకెట్టు, మెంతి పిండి రంగు పై ఎరుపు రంగు గీతాలు, ఆకుపచ్చ అంచులు డిజైన్ గల చీర ధరించి, మెడలో రోల్డ్ గోల్డ్ గొలుసు ఉంది. మృతురాలి ఆచూకీ తెలిసినవారు ఫిరంగిపురం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి, సెల్ నెంబర్ 9440900876 కి ఫోన్ చేసి తెలియపరచాలి.

తిరునాళ్లలో ఫ్లెక్సీలు నిషేధం

ప్రజాశక్తి- ఈపూరు

మండలంలో జరిగే తిరుణాళ్లలో గొడవలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా రాజకీయ నాయకులు ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను నిషేధిస్తున్నట్లు ఎస్సై విప్పర్ల వెంకట్రావు బుధవారం తెలిపారు. అలాగే, తిరునాళ్లకు వచ్చే ప్రజా ప్రతినిధులు సాయంత్రంలోపు ఆలయ దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. ప్రభల మీద రాజకీయ నాయకుల ప్రసంగాలను నిలుపుదల చేస్తున్నామన్నారు. ప్రభలపై అశ్లీల నృత్యాలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పోలీసు వారి నిబంధనలు పాటించి ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఎస్సై కోరారు.

'మాగులూరి' ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పెదకూరపాడు: మండలంలోని లగడపాడుకు చెందిన గుండా సాంబయ్య ఇటీవల మరణించాడు. వారి కుటుంబానికి మాగులూరి ఫౌండేషన్ బుధవారం ఆర్థిక సహాయం అందించారు.విద్యార్థినీవిద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందజేశారు. మాగులూరి కృష్ణారావు, కిరణ్ కుంచనపల్లి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు స్వాధీనం

ప్రజాశక్తి-వినుకొండ



మండలంలోని ములకలూరు కేంద్రంగా గుండ్లకమ్మ వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఎస్ఇబి అధికారులు బుధవారం దాడులు చేశారు. ములకలూరు సమిపంలోని గుండ్లకమ్మ వాగు నుంచి రోజు ఇసుక భారీగా అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో జిల్లా ఎస్ఇబి అధికారులు, స్థానిక అధికారులతో కలిసి దాడులు చేపట్టారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక బుల్ (ఇసుకను లోడ్ చేసే వాహనం) స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు సెబ్ సిఐ విజయభాస్కర్ తెలిపారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 1,12,423
మిర్చి ఎగుమతి	: 1,14,842
మిర్చి నిల్వ	: 82,912

మిర్చి ధరలు

	రూపాయలలో
334	7,500 - 20,000
నెం.5	13,000 - 21,000
273	9,000 - 21,000
341	8,500 - 21,500
4884	11,000 - 17,200
సూపర్ 10	16,500 - 18,500
నాన్ ఎసి	
తేజ	7,000 - 20,000
బడిగి	9,000 - 26,000
దేవనూరు డీలక్స్	14,000 - 21,000
తాలుకాయలు	5,000 - 12,500

ఒకరి భూమి.. మరొకరికి రుణం

- సొసైటీల నుండి రూ.30 లక్షలు కాజేసిన అక్రమార్కులు
- బాధితుల ఫిర్యాదుతో వెలుగులోకి
- విచారణకు ఆదేశించిన పల్నాడు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నూజెండ్ల

ఇక్కడి వారు కాదు.. సెంటు భూమి ఉండదు.. అయినా భూమిని తనఖా పెట్టి రూ.లక్షలకు లక్షలను రుణాల రూపంలో స్వాహా చేస్తున్నారు. వీరికి అధికారుతోపాటు సొసైటీల్లో కీలక బాధ్యతల్లో ఉన్నవారూ సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పల్నాడు జిల్లా నూజెండ్ల మండలంలోని త్రిపురాపురం రెవెన్యూ పరిధిలోని గొల్లపాలెంలో 44.93 ఎకరాల భూమి ఉందంటూ నకిలీ పాస్ పుస్తకాలను పుట్టించిన ఐదుగురు అక్రమార్కులు గుర్రప నాయుడుపాలెం, గుంటూరు జిల్లా ఫిరంగిపురం సొసైటీలో 2021లో రూ.30 లక్షల రుణాలు పొందారు. అక్రమార్కులకు రెవెన్యూ అధికారులు నకిలీ పాస్‌పుస్తకాలు ఇవ్వగా, సొసైటీ చైర్మన్ రుణాలు మంజూరు చేయించారంటూ గుర్రప నాయుడుపాలేనికి చెందిన డి.అంజిరెడ్డి ఇటీవల స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమతోపాటు తమ బంధువులకు చెందిన భూముల మీదే అక్రమార్కులు పుస్తకాలు పుట్టించి రుణాలు కాజేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణకు తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. అయితే తాము ఫిరంగిపురానికి చెందిన వారమని అక్రమార్కులు పాస్‌పుస్తకాల్లో పేర్లు రాయించుకున్నా అక్కడా వారి ఆచూకీ తెలియడం లేదు.

గొల్లపాలెం సర్వే నంబర్ 267-1,235,234,233లో 9.16 ఎకరాలకు సంబంధించి కన్నపనేని చిన్న వెంకటనారాయణ అనే వ్యక్తి పేరుపై వినుకొండ ఐసిఐసిఐ బ్యాంక్‌లో మార్ట్‌గేజ్ డాక్యుమెంట్ నంబర్ 1513/2019లో 12.40 లక్షలు తనఖా రుణం పొందారు. తూమకుంట లక్ష్మి పేరుపై సర్వే నంబర్ 247-2లో ఐదెకరాలకు గుర్రప్ప నాయుడుపాలెం సొసైటీలో మార్ట్‌గేజ్ డాక్యుమెంట్ నంబర్ 12177/2021లో రూ.6 లక్షలు, ఫిరంగిపురం సొసైటీలో సర్వేనెంబర్ 241లో 3.54 ఎకరాలు, 185-1లో 25 సెంట్లకు గాను మార్ట్‌గేజ్ డాక్యుమెంట్ నంబర్ 1431/2021లో రూ.6 లక్షలు రుణాలు పొందారు.


గుర్రప నాయుడుపాలెం సొసైటీ కార్యాలయం

కోరి బాలయ్య త్రిపురాపురం రెవెన్యూ సర్వేనంబర్ 271లో 2.71 ఎకరాలు, 274లో 3.45 ఎకరాలకు మార్ట్‌గేజ్ డాక్యుమెంట్ నంబర్ 1430/2021లో రూ.6 లక్షలు, గున్నా కృష్ణవేణి పేరుతో త్రిపురాపురం రెవెన్యూ సర్వేనంబర్ 236-3-1లో 2.31 ఎకరం, 236-3-3లో 2.31 ఎకరాలకు డాక్యుమెంట్ నంబర్ 14 29/2021లో రూ.6 లక్షలు రుణం తీసుకున్నారు.

రుణాలు పొందిన వారు ఈ ప్రాంతం వారు కాదు, వారికి ఇక్కడ భూములేమీ లేవు. అయినా వారి పేరుతో పాస్‌పుస్తకాలు రావడం, వాటికి రుణాలు మంజూరవడంపై పలు ఆరోపణలు వస్తున్నాయి. నూజెండ్ల మండలంలోని రెండు సొసైటీల్లో నకిలీ పాస్ పుస్తకాలతో రూ.కోట్ల రుణాలిచ్చారని, సొసైటీలోని కీలక వ్యక్తికి చెందిన బంధువులకు భూమి లేకుండానే రూ.2 లక్షల రుణాలు అక్రమ పద్ధతితో కట్టబెట్టారని తెలిసింది. వినుకొండ పరిధిలోని ఏడు సొసైటీల్లో రికార్డులన్నింటినీ పరిశీలిస్తే రూ.30 కోట్ల వరకూ కుంభకోణం వెల్లడయ్యే అవకాశం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.

పాఠశాలకు సైన్స్ పరికరాలు అందజేత

ప్రజాశక్తి - ముప్పాళ్ల


అంజనేయులు, సుబ్బారావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మండలంలోని దమ్మాలపాడు జెడ్‌పి పాఠశాలకు సైన్స్ లేబరేటరి సామగ్రిని పూర్వ విద్యార్థి వితరణగా అందించారు. హైదరాబాద్‌కు చెందిన స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి చార్టర్ అకౌంటెంట్ పాతూరి ఆంజనేయులు ఆ కంపెనీ ద్వారా రూ.2 లక్షల సామాగ్రిని బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆంజనేయులను, ఆయన తండ్రి సుబ్బారావును పాఠశాల హెచ్‌ఎం మిరియమ్మ, విద్యా కమిటీ చైర్మన్ పి.కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు సత్కరించారు.

రీసర్వే తీరుపై జెసి అసంతృప్తి

ప్రజాశక్తి-ఈపూరు


రికార్డులను పరిశీలిస్తున్న జెసి

భూరీసర్వే నిర్వహిస్తున్న తీరు సరిగా లేదని అధికారులపై పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని ఈపూరు, బొమ్మరాజుపల్లి, గుండెపల్లి, చిట్టాపురం, కొండాయపాలెం, కొండ్రముట్ల, దాసులపల్లె గ్రామాలకు ఒఆర్ఐ పటం వచ్చిందని, ఆ గ్రామాల్లో రీ సర్వేను వేగంగా పూర్తి చేసి రైతులకు భూహక్కు పత్రాలు అందించాలని ఆదేశించారు. తొలుత స్థానిక కేజీబీవీ పాఠశాలను జెసి తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థినుల హాజరు, రికార్డులను, భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.వెంకటేశ్వర్లు నాయక్, సర్వే ఇన్‌స్పెక్టర్ పార్థసారథి, మండల సర్వేయర్ చండీరాణి పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన భూములను దళితులకు తిరిగివ్వాలి

- 25న చిలకలూరిపేటలో అసైన్డ్ భూముల పరిరక్షణ సదస్సు
- హాజరు కానున్న రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు, ఇతర రాష్ట్ర నాయకులు
- వ్యవసాయ కార్మిక సంఘం కరపత్రాల ఆవిష్కరణ, పలు గ్రామాల్లో ప్రచారం

ప్రజాశక్తి - యడ్లపాడు

అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను పేదలకు తిరిగివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రోశయ్య, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ అంశంపై చిలకలూరిపేట పట్టణంలోని వెంకటేష్ గ్రాండ్‌లో ఈ నెల 25న నిర్వహించే అసైన్డ్ భూముల పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు కరపత్రాలను మండల కేంద్రమైన యడ్లపాడులో బుధవారం ఆవిష్కరించారు. అనంతరం దింతెనపాడు, కారుచోల, యడ్లపాడు, వంకాయలపాడు, బోయపాలెం తదితర గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా రోశయ్య, లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని గ్రామాల్లో భూముల రీ సర్వేను చేపట్టిందని, ఈ క్రమంలో అన్యాక్రాంతమైన అసైన్మెంట్ భూములను గుర్తించాలని కోరారు. జాలాది గ్రామ రెవెన్యూలో పోపూరివారి చెరువు (కోర్లకుంట) సర్వే నంబర్ 449లో 47 ఎకరాలను 80 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి అరెకరం చొప్పున ప్రభుత్వం అసైన్డ్‌మెంట్‌గా కేటాయించిందని తెలిపారు. అయితే వీటికి పాస్‌పుస్తకాలున్నా పంట రుణాలు ఇవ్వడంలేదని లబ్ధిదారులు చెప్పారన్నారు. వర్షపు నీరు పోకుండా మెటల్ రోడ్డు వేసినందువల్ల ఈ భూములన్నీ ముంపునకు గురవుతున్నాయని చెప్పారు. ఎస్సీలకు చెందిన అసైన్డ్ భూముల్లో రోడ్డు వేసినట్లు రీసర్వేలో తేలిందని, బాధితులకు పరిహారంగా భూమి కేటాయించాలని కోరారు. లబ్ధిదార్లకు విఆర్ఒ ఇచ్చిన సర్వే పార్సిల్స్ నోట్‌లో ఒకరి పేరు బదులు మరో పేరు రాయటం వంటి తప్పులు జరిగాయని, వీటిని వెంటనే సరి చేయాలని కోరారు. వంకాయలపాడులో టెక్స్‌టౌల్ మిల్లు నిర్మాణం పేరుతో అసైన్డ్ భూములు 40 ఎకరాల వరకూ పరిహారం ఇవ్వకుండానే తీసుకున్నారని, అయినా పరిశ్రమ ఏమీ పెట్టలేదని తెలిపారు. ఆ భూమిని దళితులకు తిరిగి కేటాయించాలన్నారు. కారుచోలలో 11 ఎకరాల సీలింగ్ భూమికి పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వలేదన్నారు. ఈ సమస్యలన్నింటి పరిష్కారం కోసం నిర్వహించే సదస్సులో ప్రజలు భారీగా హాజరవ్వాలని కోరారు. సదస్సులో రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, కులవక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి పాల్గొంటారని తెలిపారు.



యడ్లపాడులో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

అసైన్డ్ భూముల పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, సిఐటియు పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు స్థానిక పండరిపురంలోని సిఐటియు కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. గతంలో చెరువు భూములు సాగుచేసు కుంటున్న వారిని ఆ భూముల నుండి బలవంతంగా వెళ్లకొట్టారని, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో జరిగిన పోరాట ఫలితంగా పేదలకు ఆ భూములు మళ్లీ దక్కాయని అన్నారు. అయితే వీరికి వ్యక్తిగత పట్టాలిస్తామని ఎన్నికలప్పుడు హామీనిచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు విస్మరించారని, పైగా పేదలకు భూములను చట్ట విరుద్ధంగా లాక్కుంటున్నారని మండిపడ్డారు. మురికిపూడిలో అసైన్డ్ భూములు, వాగు పోరంబోకు భూముల నుండి గ్రానైట్ తవ్వకాలకు ఎన్‌ఒసి ఎలా ఇచ్చారంటూ అధికారులు, ప్రజాప్రతినిధులకు కోర్టు నోటీసులు ఇచ్చిందని అన్నారు. ఎన్‌ఒసిని వెంటనే రద్దు చేసి పేదలకు భూములను తిరిగివ్వాలని, ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. యడవల్లి భూములను 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయకుండా భయపెట్టి తీసుకున్నారన్నారు. అసైన్డ్ భూములకు రక్షణ కల్పించగ పోగా ఆక్రమణ దారులకు హక్కులు కల్పించేందుకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాద్ అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేశారని విమర్శించారు. ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలోనూ సమస్యలొస్తున్నాయన్నారు. వీటన్నింటి పరిష్కారం కోసం నిర్వహించే సద్సుకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు.


సత్తెనపల్లిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

26న యుటిఎఫ్ జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశం


జయప్రదం కోసం కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల, సత్తెనపల్లి

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఈనెల 26న నిర్వహించే యుటిఎఫ్ జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు కరపత్రాలను పిడుగురాళ్ల, సత్తెనపల్లిలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఆడిట్ కమిటి కన్వీనర్ షేక్ జమాల్, జిల్లా కార్యదర్శి చిన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలపై సమావేశాల్లో చర్చిస్తామని, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాంబశివరావు, డి.శ్రీనివాసరావు, ప్రసాదరావు, ఫిరోజ్‌బాషా, బాజీ, సుబ్బారావు, రవిచంద్ర శేఖర్, శివశంకర్, ఎన్.విష్ణుమూర్తి, కిషోర్ కుమార్, వెంకట్రావు, శేషిరెడ్డి, శేషగిరి, రమేష్‌బాబు, పి.వెంకటేశ్వర్లు, వి.శ్రీనివాసరావు, నీలి పద్మావతి, ఎం.పద్మావతి, నాగవేణు, వాసవి కన్యక, శౌరిబాబు, నిర్మల జ్యోతి, థామస్‌రెడ్డి పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు


సదస్సులో మాట్లాడుతున్న వై.గోపాలరావు

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, వీటిని నిరసిస్తూ ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి వై.గోపాలరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రమైన గురజాలలో కార్మిక, కర్షం సంఘాల ఆధ్వర్యంలో సదస్సు బుధవారం నిర్వహించారు. గోపాలరావు మాట్లాడుతూ కార్మికుల పోరాడి సాధించుకున్న హక్కులను హరించేలా కేంద్రం నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని, వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఢిల్లీలో చేసిన పోరాటం సందర్భంగా ఇచ్చిన హామీలను ఇంకా నెరవేర్చలేదని విమర్శించారు. కార్పొరేట్లకు ప్రజా ధనాన్ని అప్పనంగా దోచిపెడుతున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నారని మండిపడ్డారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను అధికారంలోకి వస్తే కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తానని ఇచ్చిన హామీని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విస్మరించారన్నారు. ఈ నేపథ్యంలో హక్కుల సాధన, హామీల అమలు కోసం అన్ని రంగాల ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాల కార్మికులు ప్రమీల, మాబుల్లా, లక్ష్మి, జ్యోతి, సీత పాల్గొన్నారు.

27న తెనాలికి సిఎం రాక

సభావేదిక కోసం స్థలాన్ని పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి- తెనాలి, తెనాలిరూరల్

ఈనెల 27న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ ప్రారంభించేందుకు తెనాలి వస్తున్న సందర్భంగా బుధవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, రూరల్ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, వివిధ శాఖల అధికారులు సభా వేదిక కోసం స్థల పరిశీలన చేశారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో కలిసి హెలిప్యాడ్ కొరకు తాలూకా జూనియర్ కాలేజీ స్థలాన్ని, సభా ప్రాంగణం కొరకు వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో స్థలాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మార్కెట్ కమిటీ పరిపాలన భవనంలో ముఖ్యమంత్రి వర్యుల పర్యటన ఏర్పాట్లపై అధికారులతో జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి చర్చించడం జరిగింది. గురువారం ప్రోగ్రాం కన్వీనర్ తలశిల రఘురాం కూడా రానున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగంతో కలిసి సమీక్షించి వేదికపై నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. తాలూకా జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్ వద్ద గ్రీన్ రూమును, టెంట్లను ఏర్పాటు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. అలాగే బారికేట్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులతో రైతు భరోసా కేంద్రాల వారిని ఇన్వాల్వ్ చేయాలని, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులకు కార్యక్రమం గురించి తెలియజేయాలని, రైతులు సభకు వచ్చి వెళ్లేందుకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. మున్సిపల్ కమిషనర్ సభా ప్రాంగణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పోలీసు వారు బందోబస్తు, రోప్ పార్టీ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఏఎస్పీ పి.అనిల్, డిఎస్పీ


తాలూకా కళాశాల ప్రాంగణంలో స్థల పరిశీలనలో అధికారులు

కె.స్రవంతిరాయ్, జిల్లావైద్యారోగ్యాధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎ.జస్వంతరావు, తహశీల్దార్ కె.రవిబాబు, ఎంఇఒ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో విజయ లక్ష్మణ్, ఎంపీపీ చందుపోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డెల్టా ప్రాంతానికి సిఎం రాక ఆనందం : ఎమ్మెల్యే

పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతమైన డెల్టా ప్రాంతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన రైతులకు వరమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. సిఎం రాకను పురస్కరించుకుని సబావేదిక పరిశీలన, ఏర్పాట్లలో భాగంగా ఆయన మాట్లాడుతూ సస్యశ్యామలమైన తెనాలి ప్రాంతంలో ముఖ్యంమంత్రి పర్యటన, రైతాంగ ప్రయోజిత కార్యక్రమాలు సంతోషమన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రతి సంవత్సరం రైతులకు రైతు భరోసా పథకం ద్వారా లబ్ది చేకూరుస్తుందన్నారు. ఈ ఏడాది కూడా రైతుభరోసా పంపిణీ ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి తెనాలి వస్తున్నారని, రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడే వేదిక తెనాలి కావటం మరింత అనందమన్నారు.



ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నేతాజీ పిలుపు

ప్రజాశక్తి - పొన్నూరురూరల్ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, వీటిని నిరసిస్తూ ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ పిలుపిచ్చారు. బుధవారం పొన్నూరులో నాయకులు ఎన్ రమేష్ బాబు అధ్యక్షతన సిఐటియు మండల సదస్సులో నేతాజీ మాట్లాడారు. కార్మికుల పోరాడి సాధించుకున్న హక్కులను హరించేలా కేంద్రం నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని, వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఢిల్లీలో చేసిన పోరాటం సందర్భంగా ఇచ్చిన హామీలను ఇంకా నెరవేర్చలేదని విమర్శించారు. కార్పొరేట్లకు ప్రజా ధనాన్ని అప్పనంగా దోచిపెడుతున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తానని ఇచ్చిన హామీని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విస్మరించారన్నారు. ఈ నేపథ్యంలో హక్కుల సాధన, హామీల అమలు కోసం అన్ని రంగాల ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్మికులు, కర్షకులు ఏప్రిల్5న చలో ఢిల్లీ జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమం లో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, రైతు సంఘం నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు



ఆర్‌పిలకు కోతల్లేకుండా వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర మెప్మా విభాగంలో పనిచేస్తున్న ఆర్పీలకు ఎలాంటి కోతలూ లేకుండా వేతనాలు ఇవ్వాలని ఆర్‌పిల యూనియన్ యూనియన్ నగర గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం పాతగుంటూరు, సిఐటియు కార్యాలయంలో బి.రమణ అధ్యక్షతన మెప్మా ఆర్‌పిల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్పీలకు జీతం పూర్తిగా ఇవ్వట్లేదని, నెలకు రూ.4, రూ.5వేలు మాత్రమే వస్తున్నాయని, వీటితో ఆర్‌పిల కుటుంబాలు ఎలా జీవించాలని ప్రశ్నించారు.కొందరు అధికారులు ఆర్పీల పట్ల వివక్షపూరితంగా వ్యవహరించటం సరైన విధానం కాదన్నారు. అధికారులను మంచి చేసుకుంటే ఆర్పీలకు పూర్తి వేతనాలు వస్తాయని మభ్యపెడుతున్నారన్నారు.ఈ ఇలాంటి చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ నగర అధ్యక్షులు బి.రమణ మాట్లాడుతూ ఈ సమస్యల పరిష్కారం కోసం నేడు మెప్మా పీడీని కలిసి వినతిపత్రం అందచేసి, చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌పిలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు అచ్చమాంబ, జిల్లా కోశాధికారి సైదాబీ, నగర కమిటీ సభ్యులు రత్నకుమారి, పూజిత, అనూష, సీతారావమ్మ తదితరులు పాల్గొన్నారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలి:


ప్రారంభిస్తున్న చైర్మన్ కామేశ్వరరావు

వినియోగదారులకు మెరుగైన సేవలందించటంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ముందుందని ఆ బ్యాంక్ చైర్మన్ కె.కామేశ్వరరావు అన్నారు. స్థానిక చెంచుపేటలో కెప్టెన్ విజయప్రసాద్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంక్ 240వ బ్రాంచ్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మేలు చేకూర్చేవిదంగా డిపాజిట్లపై అత్యధికంగా 8.60శాతం వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. ఉజ్వల టర్మ్ డిపాజిట్ స్కీమ్‌లో రూ.15.10లక్షల డిపాజిట్‌పై అత్యధికంగా 8.75శాతం వడ్డీని, గడచిన రెండేళ్ళలో విదేశీ విద్యకోసం 500 మంది విద్యార్థులకు రూ.60 కోట్ల విద్యారుణాలు, బంగారు నగల తాకట్టుపై గ్రాముకు రూ.4,150 చెల్లిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలకు బ్యాంకుద్వారా సహకరిస్తున్నట్లు చెప్పారు. మొత్తం 8 జిల్లాల్లో 27లక్షల ఖాతాదారులతో రూ.17వేల కోట్ల వ్యాపారాన్ని నిర్వహించినట్లు చెప్పారు. బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు రీజినల్ మేనేజర్ పి.వీరారెడ్డి, సిజిజిబిఓఏ బి.శ్రీనివాసరావు, బ్యాంకు అధికారులు బి.సువర్ణరాజు, సిహెచ్ యామలయ్య, ప్లానింగ్ మేనేజర్ కె.ఆంజనేయులు, బ్రాంచ్ మేనేజర్ కె.సురేష్‌బాబు, ఖాతాదారులు పాల్గొన్నారు.

1 నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు

కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే మహిళా బిల్లును ఆమోదించాలి : పిఒడబ్ల్యూ

ప్రజాశక్తి-గుంటూరు

అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా మార్చి 1నుండి 8 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే సభలను జయప్రదం చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.విష్ణు, బి.పద్మ పిలుపునిచ్చారు. బుధవారం అరండల్‌పేటలోని మాదాల నారాయణస్వామి భవన్‌లో పిఒడబ్ల్యూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళాభివద్ధిని దెబ్బతీస్తూ, స్త్రీ-పురుష అసమానత్వాన్ని పెంచిపోషించే బీజేపీ బ్రాహ్మణీయ, పితస్వామిక పాలనకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు, ధర్నాలు, సదస్సులు చేపట్టనున్నట్లు చెప్పారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి మహిళలపై దాడులు, హింస పెరిగి పోయిందని, బీజేపీ పాలిత 11రాష్ట్రాలలో లవ్‌జిహాద్ పేరుతో మతాంతర వివాహ వ్యతిరేక చట్టాలు, మత మార్పిడి వ్యతిరేక చట్టాలు తెచ్చి రాజ్యాంగ హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉందని, మహిళల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే ఈ పార్లమెంట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలన్నారు. జగన్ ప్రభుత్వం తెచ్చిన దిశ చట్టం, దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్ మహిళలకు, మైనర్ బాలికలకు రక్షణ కల్పించలేక పోయాయని అన్నారు. మహిళలపై, మైనర్ బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను, అత్యాచారాలను, హత్యలను అరికట్టాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనానికై, స్త్రీ, పురుష సమానత్వంకై, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలపై సమరశీలంగా పోరాడాలని మహిళలకు వారు పిలుపునిచ్చారు. సమావేశంలో పిఒడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బి.రమాసుందరి, రాష్ట్ర సహాయ కార్యదర్శి శీలం యేసమ్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భారతి, కల్పన, కుసుమ, మంజుల, వసంత తదితరులు పాల్గొన్నారు. ఈ



3న జెడ్పీ స్థాయి సంఘ సమావేశాలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా ప్రజాపరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలను మార్చి 3వ తేదీన జెడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సిఇఒ మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ మొత్తం ఏడు స్థాయి సంఘ సమావేశాలు ఆయా సంఘాల ఛైర్మన్ల అధ్యక్షతన జరుగుతాయన్నారు. కావున అధికారులు సకాలంలో సమాశాలకు హాజరు కావాలని కోరారు.


వినతిపత్రం ఇస్తున్న ఎం.రవి, భాగ్యరాజు, పారిశుధ్య కార్మికులు

సూపర్‌వైజర్ వేధింపులపై కార్మికుల నిరసన

విధులు బహిష్కరించి, సిఆర్‌డిఎ అధికారులకు వినతి

ప్రజాశక్తి - తుళ్లూరు

తమను వేధిస్తున్న సి ఆర్ డి ఎ సూపర్ వైజర్ మన్మధరావు పై తగు చర్యలు తీసుకోవాలని రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం, సిఐటియు డిమాండ్ చేసింది. మన్మధరావు వేధింపులను నిరసిస్తూ పారిశుధ్య కార్మికులు బుధవారం విధులు బహిష్కరించారు. మన్మధరావును అనంతవరం నుండి బదిలీ చేయాలని, పారిశుధ్య కార్మికులకు పని భద్రత, రక్షణ కల్పించాలనిరాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి, సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్య రాజు డిమాండ్ చేశారు. అనంతవరం గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికులు గతంలో తనపై అధికారులకు ఫిర్యాదు చేశారన్న ఉక్రోషంతో మన్మధరావు కార్మికులపై ప్రతీకారం తీర్చుకుంటాననంటూ మహిళలను తీవ్ర వేధింపులకు గురిచేస్తుండడాన్ని రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం,సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. పారిశుధ్య కార్మికులు విధులను బహిష్కరించిన అనంతరం తుళ్లూరు సి ఆర్ డి ఏ కార్యాలయంలో శానిటేషన్ కో ఆర్డినేటర్ నరసింహారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి, భాగ్యరాజు మాట్లాడుతూ,మన్మధరావు పదే పదే కార్మికులను పనిలోకి రావద్దంటూ నాకు చాలా పలుకుబడి ఉందంటూ కార్మికు లను బెదిరింపులకు గురి చేస్తున్నాడని అన్నారు. మహిళా కార్మికులను దుర్భాషలాడుతున్నాడని అన్నారు.మన్మధరావుపై గతంలో సి ఆర్ డి ఎ అధికారులకు ఫిర్యాదు చేసినా అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల రెచ్చిపోయి కార్మికులను తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేధింపులు ఆపకపోతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ కు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.

తేజా ఇన్‌ఫ్రా డెవలపర్ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సుబ్బారెడ్డి, యశ్వంత్‌రెడ్డి

తేజా ఇన్‌ఫ్రా డెవలపర్ బ్రౌచర్ ఆవిష్కరణ బుధవారం స్థానిక లక్ష్మీపురంలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తేజా ఇన్‌ఫ్రా డెవలపర్ చైర్మన్ బి.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజధాని నగరానికి ధీటుగా వినియోగదారులకు అందుబాటులో, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అపార్టుమెంట్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. తులసీ మైఫియర్ పేరుతో పండరీపురం 5వ లైనులో నిర్మాణ పనులు ప్రారంభించినట్లు వివరించారు. నూతన హంగులతో వినియోగదారుల ఆకాంక్ష మేరకు అపార్టుమెంటు నిర్మాణం చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రత్యేకమైన ఇంటీరియల్ డిజైన్లు, అధునిక కిచెన్‌తో విశాలమైన హాల్, లిఫ్ట్, విశాలమైన కారు పార్కింగ్‌తోపాటు, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ యశ్వంత్ రెడ్డి తెలిపారు. దాదాపు 20ఏళ్లుగా నిర్మాణ రంగంలో వినియోగదారుల మన్ననలు పొందుతున్న ప్రముఖ సంస్థ తేజా ఇన్ఫ్రా డెవలపర్స్ చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా అభివర్ణిం చారు.

బోధనేతర పనులతో పెరుగుతున్న ఒత్తిడి

- విద్యా సంవత్సరం చివరికి వస్తోంది
- బోధనకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది
- ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ఆవేదన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

బోధనేతర పనుల కారణంగా తమపై ఉన్న ఒత్తిడి అంతా ఇంతా కాదని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. విద్యా సంవత్సరం చివరకు వస్తోంది. అయినా, పాఠాలు చెప్పడం పూర్తి కాలేదు. విద్యార్థులతో పునశ్చరణ సం గతి సరేసరి. బోధనేతర పనుల నుండి తమను తప్పిస్తే తప్ప ఇవన్నీ సాధ్యం కాదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చిలకలూరిపేట మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు కలుపుకొని ప్రధానోపా ధ్యాయుల సంఖ్య 18, ఉపాధ్యాయుల సంఖ్య సుమారు 350. ఒకవైపు టీచర్ల బది లీల నిర్వహణ, అవసరమైన సమా చారం, పాఠశాలల వారీగా ఖాళీ పోస్టులు, సర్దుబాటుకు సంబంధించిన వివరాలు ఇవ్వమనడం, ఈ తరహావి రోజుకో నమునా ఇచ్చి సంబంధిత సమాచారం వెంటనే పంపాలని విద్యాశాఖాధికారుల నుంచి వచ్చే ఒత్తిళ్ల భరించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిలబస్ పూర్తి చేసుకుని పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాల్సిన సమయంలో ఉపాధ్యాయులకు సం బంధం లేని రకరకాల సమాచారాలు అడగటం దారుణమంటున్నారు. ప్రస్తుతం యుడైస్, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక వివరాలు ఇవ్వాలని కోరడమే ఇందుకు ఉదాహరణ. దీంతో డేటా సేకరణలో ఉపాధ్యాయులు కూడా భాగస్వాములు కావడంతో కొన్ని పాఠ శాలల్లో బోధనకు తీవ్ర ఆటంకం ఏర్పడు తోందన్నారు. పైగా సమాచారం ఇచ్చాకే విద్యార్థులకు బోధించాలని చెబుతున్నారని, రేపు పరీక్షా ఫలితాలు వెలువడ్డ తర్వాత అటు తల్లి దండ్రులు, ఇటు అధికారుల నుంచి ఎటువంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న ఆందోళన వ్యక్తం చేశారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం సమీపిస్తుండ టంతో పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలు, అభివృద్ధికి ఏం చేయాలో తయారు చేసి సమగ్రశిక్షా అధికారులకు అందజేయాలి. జిల్లా స్థాయిలో రానున్న విద్యా సంవత్సరం నుంచి ఎంత బడ్జెట్ అవ సరమో, నిధులు ఎంత కోర వచ్చనే అంచ నాలు, తదితర సమాచారం ప్రధానో పాధ్యాయులు ఇవ్వాలని అంటున్నారని, అంతే కాకుండా అంగన్వాడీలో ఎంత మంది పిల్లలు ఉన్నారో, ప్రాథమిక పాఠశాలలో ఎంత మంది చదువుతున్నారో, వారిలో వికలాం గులు, సమీప గ్రామాల నుంచి వచ్చే విద్యా ర్థుల్లో ఎంత మందో, వారికి ఇచ్చే ఎస్కార్ట్ అలవెన్స్ మొదలైన సమాచారం కోరడం వంటి పనులతో తాము ఒత్తిడికి గురవుతున్నట్లు చెప్పారు. ఇటీవల ఉపాధ్యాయులపై ఇంకా ఒత్తిడిని పెంచారని, విద్యార్థుల బైజూస్ పాఠాలు ఎంత వరకు వచ్చాయో, ఏయే సబ్జెక్టులు ఎంత మేరకు పూర్తి చేశారన్న వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలంటూ ఉపా ధ్యాయులపై విద్యాశాఖ తీవ్రమైన ఒత్తిడి తెస్తోందని వాపోయారు. వీటిని 3,4 సెట్లు జిరాక్స్ కాపీలు ఇవ్వాలనడం, వాటి ఖర్చు సుమారు రూ.300 ఖర్చు అవు తోందని అన్నారు. గత మూడేళ్లుగా ఒక్క రూపాయి కూడా స్కూల్ గ్రాంట్ జమ చేయలేదని, తమ జేబుల్లో డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందని ప్రధానోపాధ్యాయులు చెప్పు కొచ్చారు. ఫిబ్రవరి 8 నుండి సిబిఎ-2 జతపరచి, మళ్లీ వాటి మార్కులు ఆన్ లైన్‌లో నమోదు చేయాలని, పరీక్షల సమ యంలో పై సమాచారాన్ని తమ నుంచి కాకుండా సిఆర్‌పిలు, ఇంజనీరింగ్ అధి కారులు, అకాడమిక్ అధికారి దగ్గర తీసు కోవాలని కోరుతున్నారు. రాబోయే కాలం లో బోధ నేతర పనుల నుండి ఉపాధ్యాయు లను, ప్రధానోపాధ్యాయులను తప్పిం చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



26న యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-వినుకొండ

ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని బుధవారం స్థానిక యుటిఎఫ్ వినుకొండ ప్రాంతీయ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వినుకొండ ప్రాంత యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎ.నాగేశ్వరరావు మాట్లాడుతూ నరసరావు పేటలోని కొత్త రఘురామయ్య కాలేజీలో ఈ సమావేశం జరగనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అవలంభిస్తున్న నిరంకుశ ధోరణులను తిప్పికొట్టే విధంగా సం ఘాలు బలో పేతం కావాలని, కార్యకర్తలు సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు. జిల్లా కార్యదర్శి ఎం.రవిబాబు, ఆర్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రథమ కౌన్సిల్ సమా వేశాల్లో అత్య ధిక ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఎం.పోలయ్య సీనియర్ నాయకులు జి. నాగేంద్రుడు ఇ. వెంకట్‌రెడ్డి, ఐదు మండలాల యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థికి యుటిఎఫ్ నాయకుని విరాళం

ప్రజాశక్తి-వినుకొండ

గుంటూరు గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీలో చదువుతున్న మతుకుమల్లికి చెందిన కె.జార్జ్‌కు యుటిఎఫ్ సీనియర్ నాయకులు జి.నాగేంద్రుడు వరుసగా మూడు నెలల పాటు నెలకు రూ.5,000 చొప్పున విరాళం ప్రకటించారు. ఈ విరాళాన్ని విద్యార్థి తండ్రి చిన్నయ్యకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఐదు మండలాల యుటిఎఫ్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. గత వేసవి సెలవుల్లో యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పాలిటెక్నిక్, ఎపిఆర్‌జెసి ఉచిత శిక్షణ కార్యక్రమంలో జార్జ్ పాల్గొని మంచి ర్యాంకు సాధించాడు.

జానపాడు జెడ్‌పి పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మండలంలోని జానపాడులోని జిల్లా పరిషత్ పాఠశాలను జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ఆయన, మధ్యాహ్న భోజనం ఎలా ఉందో అడిగి వివరాలు తెలుసు కున్నారు. ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్స్ డైరీలు, మార్కుల జాబితాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థుల పరీక్షా ఫలితాలను విశ్లేషించారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తయారు చేయాలని ఆదేశించారు. పాఠశాల రికార్డులపౌ ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడిన ఉపవిద్యాశాఖాధికారి, పరీక్షలు రాసే విధానం, మంచి మార్కులు ఎలా తెచ్చుకోవాలనే దానిపై ప్రత్యేకంగా విద్యార్థులకు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.నరసింహారావు, ఖాసిం పిరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులను పట్టణ సిఐ యు.శోభన్‌బాబు బుధవారం అభినందించారు. ఈనెల 19న కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించగా పట్టణానికి చెందిన జీవన్, సాత్విక్, శివశ్రీ పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన వీరు బహుమతులు సాధించగా వీరితోపాటు కోచ్ రవిని సిఐ, ఎస్ఐ రఘుపతి అభినందించారు.



పతకాలు సాధించిన వారిని అభినందిస్తున్న సిఐ, ఎస్ఐ



స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

1 నుంచి ఉచిత ఉపాధి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ, సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మార్చి 1 నుంచి ఉచిత ఉపాధి శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు అభయ ఫౌండేషన్ నిర్వాహకులు బాలచంద్ర తెలిపారు. స్థానిక సత్యసాయి అర్బన్ హెల్త్ సెంటర్ పైన నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సు 45 రోజులు యువకులకు డ్రైవింగ్, సెల్‌ఫోన్ రిపేర్ కోర్సు 30 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఔత్సాహికులైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాయి ఎడ్యుకేషనల్ ప్రెసిడెంట్ అక్కినేని అనిల్ మాట్లాడుతూ సత్యసాయి సేవా సమితి



ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అభయ ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో యువతీ యువకులకు ఉపాధి శిక్షణ ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయమన్నారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జక్క శ్రీనివాసరావు మాటాడుతూ పూర్తి వివరాలకు 9154580 684 మొబైల్ నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

వంద పడకల ఆసుపత్రికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-వినుకొండ

వందపడకల ఆసుపత్రి, ముస్లిం మైనారిటీ కాలేజీ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్థల పరిశీలన చేశారు. ఇటీవల వినుకొండకు వచ్చిన సిఎం జగన్, మైనారిటీ కాలేజీ , వంద పడకల ఆసుపత్రి ఏర్పాటుకు రూ.15 కోట్లు, మైనారిటీ కాలేజీకి రూ,10 కోట్లు కేటాయిస్తామంటూ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తిమ్మాయపాలెం రోడ్డులోని వర్ఫ్ బోర్డు, నరస రావుపేట రోడ్డులోని ఎన్ఎస్‌పి స్థల పరిశీలన చేశారు.

వేల్పూరులో నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-వినుకొండ

శావల్యాపురం మండలం వేల్పూరులో బుధవారం ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు పలు సిసి రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జిడిసిసి బ్యాంక్ చైర్మన్ లాల్ పురం రాము, మండల ఎంపీపీ, సర్పంచులు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కన్నెగంటి హనుమంతుకు నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

బ్రిటిష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించిన పుల్లరి వ్యతిరేక పోరాట యోధుడు కన్నెగంటి హనుమంతుకు విగ్రహానికి సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసి, భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టియు) ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కన్నెగంటి హనుమంతు 101వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక శ్రీనివాసరావుపేట ఆరో లైన్ లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు యు. గనిరాజు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఎన్‌వి కృష్ణ, ఎఐకెఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.పోతురాజు, పార్టీ, ప్రజా సంఘాల



నాయకులు పాల్గొన్నారు. **అమరావతి:** మండలంలోని మును గోడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విప్లవవీరులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి,కన్నెగంటి హను మంతుల వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు.



యార్డు చైర్మన్‌కు న్యాయవాదుల సన్మానం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన పెం డెం బాబురావు ను పలువురు న్యాయవాదులు బుధవారం ఘనంగా సన్మానించారు. చైర్మన్ బాబు రావును సీనియర్ న్యాయవాదులు దాసరి జ్ఞాన్ రాజ్ పాల్, మాదంశెట్టి వేదాద్రి సత్క రించి అభినందించారు. జిల్లెల పాల్‌రాజ్, జెట్టి శేఖర్, మూర్తి, శంకర్, జడా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు శివారెడ్డి వర్ధంతి సభ

ప్రజాశక్తి - మంగళగిరి

సిపిఎం రాష్ట్ర నాయకులు కమ్యూనిస్టు ఉద్యమ నేత సింహాద్రి శివారెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా ఈనెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు మంగళగిరి సిపిఎం కార్యాలయంలో వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లుగా సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎస్ చేంగయ్యా బుధవారం తెలిపారు. ఈ సభ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతుందని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. సిపిఎం సభ్యులు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఫ్లెక్సీల తొలగింపుపై నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలో బీసీ సేన ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభకు స్వాగతం పలుకుతూ గౌతమ బుద్ధ రోడ్డులో డివైడర్లకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడంపై బీసీ సేన నాయకులు కార్పొరేషన్ కార్యలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు ఎస్ నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, పూలే ,రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, వంటి నాయకుల ఫోటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడం దారుణమని అన్నారు. కార్పొరేషన్ కమిషనరును, టౌన్ ప్లానింగ్ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఫ్లెక్సీలు కట్టుకోమంటేనే కట్టుకున్నామని ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. కార్పొరేషన్ అధికారుల నుండి సరైన సమాధానం రాకపోవడంతో నిరసనకారులు వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో బిసి సేన నాయకులు గోలి నాగ కుమార్, పి రామచంద్ర రావు, కె కృష్ణ కిషోర్, సాదు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - తుళ్లూరు

పేదరికం, నిరక్ష్యరాస్యత,బాల్య వివాహాల నిర్మూలనా చట్టం పై అవగాహన లేకపోవడం తదితర కారణాల వల్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డి శ్రీనివాస్ అన్నారు. బాల్య వివాహాల వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యల పై చైతన్యం కొరవడటం కూడా బాల్య వివాహాలు జరగడానికి ప్రధాన కారణమన్నారు. స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాలులో బాల్య వివాహాల పై అవగాహనా సదస్సు నిర్వహించారు.బాల్య వివాహాలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కె దొరబాబు, ఎంపిడివో శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సునీత,మహిళా పోలీసులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ భవనానికి రూ.11లక్షల సామగ్రి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని ఇప్పటం గ్రామంలో ఉన్న వైయస్సార్ కమ్యూనిటీ భవనానికి గ్రామస్తులు రూ.11 లక్షల విలువచేసే సామాగ్రిని బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు అందజేసినట్లు వైసిపి తాడేపల్లి మండల నాయకులు మున్నంగి వివేకానంద రెడ్డి తెలిపారు. 8 ఏసీలు, వెయ్యి మందికి భోజనానికి సరిపడే కుర్చీలు స్టీల్ బెంచ్‌లను గ్రామస్తుల అందించినట్లు తెలిపారు. గ్రామంలోని కమ్యూనిటీ భవనానికి స్వచ్ఛందంగా సామాగ్రిని అందజేసిన దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గృహ నిర్మాణంలో లక్ష్యాలను అధిగమించాలి

● జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



సబ్ కలెక్టర్ కార్యాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-తెనాలి

జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలు నిర్దేశిత లక్ష్యాలను అధికమించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి అన్నారు. స్తానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి గృహనిర్మాణ శాఖ అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులతో బుధవారం వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహనిర్మాణాలకు అనుకూల పరిస్థితులున్నాయని, ప్రస్తుత పరిస్థితుల్లో నిర్మాణాలు వేగవంతం కావాలన్నారు. ప్రత్యేకించి పొన్నూరు మండలంలో జగనన్న కాలనీల్లో లెవలింగ్, అంతర్గత రోడ్లకు పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వారం గృహనిర్మాణాలపై సమీక్ష ఉంటుందని, పురోగతి లేని చోట సంబంధిత ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, గృహనిర్మాణశాఖ అధికారులను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే రక్తహీనతపై నిర్వహించిన సర్వేలో గుర్తించిన వారిని సచివాలయాల వారీగా మ్యాపింగ్ చేసి మందులు, పౌష్టికాహారం పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు క్లైయిమ్స్‌ను పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. జేసి మాట్లాడుతూ ఎఫ్‌పిఓఎల్ఆర్ దరఖాస్తులు పరిష్కరించేందుకు తహశీల్దార్లతో సబ్ కలెక్టర్ సమీక్షించాలన్నారు. గ్రమాల్లో ఒన్‌టైమ్ కన్వర్షన్ దరఖాస్తుల పరిష్కారం కోసం నివేదికలను తహశీల్దార్లు సబ్ కలెక్టర్‌కు అందించాలన్నారు. ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం తక్షణమే పూర్తిచేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలక్టరేట్ నుంచి డిఆర్‌వో కెక.చంద్రవేఖరరావు, హౌసింగ్ పిడి సాయినాథ్‌కుమార్, సిపివో ఉషశ్రీ, జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమాధికారిణి మనోరంజని, మెప్మా పిడి వెంకటనారాయణ పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే అన్ని వర్గాలకు సమన్యాయం

ప్రజాశక్తి - తాడికొండ

రాజ్యాంగం ద్వారా అన్ని వర్గాలకు సమన్యాయం చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఈ దేశానికి దిక్సూచి వంటి వారని నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. తాడికొండ పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ స్థానాలు 36 ప్రకటిస్తే వాటిలో 25 ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీలకు ఇచ్చారని, ఇటీవల ప్రకటించిన 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 14 ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీలకు ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ టి. సరోజిని నరసింహారావు, మాజీ ఎంపీపీలు కొమ్మినేని రామచంద్రరావు, బండ్ల పున్నారావు, రాష్ట్ర కార్యదర్శి బుర్ర వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి, జిల్లా ఎస్టి సెల్ ప్రధాన కార్యదర్శి టి. నరసింహారావు, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, టి. నాగరాజు, కె. పున్నారావు, సర్పంచులు బిక్కీ శివ రామకృష్ణ, పాల్గొన్నారు.

'పోతుల సునీత పద్మశాలి కాదు'

ప్రజాశక్తి - మంగళగిరి:పద్మశాలీలకు ఒక్క ఎమ్మెల్సీ స్థానం కూడా ఇవ్వలేదని పోతుల సునీత పద్మశాలి కాదని , ఏపి రాష్ట్ర పద్మశాలీయ సంఘం అధ్యక్షులు జగ్గరపు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 26 నియోజకవర్గాల్లో పద్మశాలీలు ఎక్కువగా ఉన్నారని ఒక్కో రాజకీయ పార్టీ 12 సీట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సీటివ్వని చోట పద్మశాలీలను బరిలో ధింపుతామని, ఏదైనా ఒక పార్టీ సీటిచ్చి మిగిలిన వారు ఇవ్వకపోతే ఆ ఒక్క అభ్యర్థిని గెలిపించుకుంటామన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మునగపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల ప్రకటించిన 18 ఎమ్మెల్సీ సీట్లలో ఒక్క ఎమ్మెల్సీ సీటు కూడా పద్మశాలీలకు కేటాయించకపోవడం దారుణమని అన్నారు. ఇకపై పద్మశాలీలు సంఘంగా ఏర్పడి సమైక్యంగా రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తామని అన్నారు. పద్మశాలి సంఘం నాయకులు బెనర్జీ, తదితరులు పాల్గొన్నారు.

పుష్కరఘాట్ల వద్ద షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని సీతానగరం పుష్కరఘాట్ల వద్ద అపర కర్మలు నిర్వహించుకునేవారికి ఇబ్బందులు లేకుండా ఒక షెడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని ఎంటిఎంసి అధికారులకు స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సూచించారు. బుధవారం పుష్కరఘాట్ల వద్ద ఉన్న శ్రీమద్ వీరాంజనేయ కోదండరామాలయానికి నిద్ర చేసేందుకు వచ్చే యాత్రికులు రాత్రి సమయంలో వసతి కల్పించడానికి వీలుగా దేవస్థానం దగ్గరలో ఉన్న కార్పొరేషన్ బిల్డింగ్‌ను తక్కువ ఫీజుతో యాత్రికులకు అద్దెకివ్వాలని, అందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. అనంతరం ఫిషాంధ్ర షాపులకు ఉండవల్లి సెంటర్‌లో ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఇక్కడ ఏర్పాటు చేయబోయే షాపులు మత్స్యకారుల జీవనోపాధి పెంపునకు ఉపయోగపడతాయని ఆకాంక్షించారు. రోడ్డుపై చేపల విక్రయాలు జరగకుండా ఉండేందుకు షాపుల నిర్మాణం ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిఇ సిహెచ్ కృష్ణారెడ్డి, వైసిపి పట్టణ కన్వీనర్ బి. వేణుగోపాలస్వామిరెడ్డి, బి. అనిల్ తో పాటు మత్స్యకార శాఖ జిల్లా అధికారులు, స్థానిక మత్స్యకారులు పాల్గొన్నారు.

మత్తు జోలికెళ్లొద్దు.. జీవితాలను చిత్తు చేసుకోవద్దు..



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్ జి. శేఖర్‌బాబు

ప్రజాశక్తి-తాడేపల్లి

మత్తు జోలికి వెళ్లి విద్యార్థులు తమ జీవితాలను చిత్తు చేసుకోవద్దని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ జి.శేఖర్ బాబు కోరారు. బుధవారం రాజధానిలో భాగమైన పెనుమాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మత్తుపదార్థాల దుర్వినియోగంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. స్నేహితుల ప్రభావంతోనో, సినిమాల ప్రభావంతోనో, గొప్పల కోసమో, ఎవరో చెప్పారనో మాదక ద్రవ్యాలు అలవాటు చేసుకోవద్దని సూచించారు. వీటివల్ల గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్, ఊపిరితిత్తులపై ప్రభావం, శ్వాసకోశ సంబంధమైన సమస్యలు వస్తాయని హెచ్చరించారు. వీటికి దూరంగా ఉండి సమాజానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ కో-ఆర్డినేటర్ బి.రమేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.పూర్ణచంద్రశేఖరరావు, ఉపాధ్యాయులు ఎన్.శ్రీదేవి. కె.కృష్ణప్రియ, ఎన్.హరికృష్ణ, మురళి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

26లోగా ఈ-కెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి-తెనాలి

రైతులు ఈనెల 26లోగా ఈ-క్రాప్ నమోదు, ఈ -కేవైసి ప్రక్రియ పూర్తి చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఆదేశించినట్లు మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ బుధవారం తెలిపారు. పంటలకు పెట్టుబడి రాయితీ, పంటల భీమా, సున్నావడ్డీకి పంటరుణాలు, పంట కొనుగోలు వంటి సౌకర్యాలను రైతులు పొందాలంటే ఈ-కేవైసి తప్పనిసరి అని చెప్పారు. రైతులు గమనించి ఈ- క్రాప్ నమోదు, ఈ- కేవైసి చేయించుకోవాలన్నారు

వ్యాపార అభివృద్ధికి నాణ్యతా ప్రమాణాలే కీలకం

ప్రజాశక్తి -మంగళగిరి

వ్యాపార అభివృద్ధికి నాణ్యత ప్రమాణాలు కీలకమని ఎన్నారై వేమూరి రవికుమార్ అన్నారు. స్త్రీ శక్తి పథకంలో కుట్టుమిషన్లు శిక్షణ పొందిన మహిళలకు నారా లోకేష్ ఉపాధి కల్పించేందుకు బుధవారం కొత్త బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన జ్యూట్ బ్యాగ్ తయారీ యూనిటును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్లాస్టిక్, కాటన్ కన్నా జూట్ ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ రాజశేఖర్, ట్రైనర్ కే.స్వప్న, టిడిపి మహిళా నాయకురాలు టి. జానకి దేవి, ఆకుల జయ సత్య, ఆరుద్ర భూలక్ష్మి పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -మంగళగిరి

మంగళగిరి బైపాస్ భోగి ఎస్టేట్స్ నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో తెలుగు యువత ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మంగళగిరి వాలీబాల్ లీగ్ పోటీలను టిడిపి జాతీయ అధికార ప్రతినిధి నజీర్ అహ్మద్ ప్రారంభించారు.ఈ పోటీలు 26వ తేదీ వరకు జరుగుతాయని, తెలిపారు.కార్యక్రమంలో నందం అబద్ధయ్య, పోతీనేని శ్రీనివాసరావు, టి.జానకి దేవి, ఆకుల జయసత్య, ఆరుద్ర భులక్ష్మి, డి. రాజు, వి.వెంకట్రావు, అమర సుబ్బారావు, కె. శ్రీ అనిత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ భారతమ్మకు నివాళి

ప్రజాశక్తి-ఫిరంగిపురం



భారతమ్మ (ఫైల్)

మండలంలోని నుదురుపాడు గ్రామం పోలేరమ్మ సెంటర్లోని అంగన్‌వాడీ టీచర్ భారతమ్మ (55) బుధవారం అనారోగ్య కారణాలవల్ల మృతి చెందారు. భారతమ్మ మృతికి చింతిస్తూ సిఐటియు మండల కమిటీ, అంగన్‌వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ ఫిరంగిపురం ప్రాజెక్ట్ కమిటీ సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి షేక్ మస్తాన్ వలి.అంగన్‌వాడీ ఫిరంగిపురం సెక్టర్ అంగన్‌వాడీ కార్యకర్తలు,సూపర్‌వైజర్లు , జిల్లా పరిషత్ చైర్మన్ సురేష్, స్థానిక ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిలు భారతమ్మ భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



చిన జీయర్ స్వామికి స్వాగతం పలుకుతున్న ఆశ్రమ నిర్వాహకులు

శివచైతన్య ఆశ్రమంలో జీయర్ స్వామి

ప్రజాశక్తి-తాడేపల్లి: స్థానిక నులకపేటలోని శివ చైతన్య ఆశ్రమం (చైతన్య తపోవనం) రజతోత్సవంలో భాగంగా బుధవారం త్రిదండి చినజీయర్‌స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆశ్రమ నిర్వాహకులు స్వాగతం పలికారు. పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని మంగళశాసనాలు చేశారు. కార్యక్రమంలో జీయర్ ఎడ్యుకేషన్ ఆశ్రమ ట్రస్టు నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, విజయకీలాద్రి అర్చక బృందం పాల్గొన్నారు.

మైనింగ్ ప్రాంతాల్లో విజిలెన్స్ తనిఖీలు

అధికారుల సమీక్షా సమావేశంలో పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి



ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మైనింగ్ జరుగుతున్న ప్రాంతాల్లో తప్పని సరిగా విజిలెన్స్ కమిటి అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టి నివేదికలు పంపాలని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. బుధవారం పల్నాడు జిల్లాలోని గనులు శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, అటవీశాఖకు చెందిన జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి బుధవారం నరసరావుపేటలోని జిల్లా కలెక్టర్ చాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాకు గనుల శాఖకు సంబంధించిన జిల్లా ఖనిజ నిధులు (డి.ఎం.ఎఫ్) ఎంత ఉన్నాయో పూర్తి స్థాయి నివేదికను కలెక్టరేట్‌కు పంపాలని ఆ శాఖను ఆదేశించారు. పల్నాడు జిల్లా ఏర్పాటు అయిన తరువాత జిల్లాకు కేటాయించిన నిధుల వివరాలపై చర్చించారు. నాన్ ఆపరేషన్ పరిధిలో ఉన్న లీజులకు సంబంధించి తనిఖీలను వెంటనే నిర్వహించి అనుమతులను ఇస్తూ క్లియరెన్స్ పత్రాలను ఇవ్వాలన్నారు. వాటికి ఎన్విరాన్ మెంట్ క్లియరెన్స్ ధ్రువపత్రాలను వెంటనే అందజేయాలని ఆదేశించారు. దాచేపల్లి మండలం బట్రుపాలెం ప్రాంతంలో రంగు రాళ్లను తస్కరించుకు పోతున్నారని పత్రికల్లో కథనాలు రావడంతో స్పందించిన జిల్లా కలెక్టర్ ఫారెస్ట్, రెవెన్యూ శాఖల అధికారులు ఒక కమిటిగా ఏర్పడి అక్కడ జరుగుతున్న పరిస్థితులను పరిశీలించి వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల వివరాలను పంపించాలని అధికారులను ఆదేశించారు. రాజు పాలెం మండలం టి.ఎన్. నగర్ ప్రాంతానికి చెందిన ప్రజలు స్పందన ద్వారా ఫారెస్ట్ అధికారులు రిజర్వ్ ఫారెస్ట్ భూములకు పట్టాలు ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారని, సంబంధిత అధికారులు నివేదికను తయారు చేసి పంపి వారి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా గనుల శాఖ అధికారులు రామోహనరావు, డి.వి.రంగ కుమార్, డి.డి. సత్యనారాయణ, అటవీ శాఖ అధికారి రామచంద్ర రావు, కాలుష్య నియంత్రణ మండలి ఇ.ఇ. నారాయణ పాల్గొన్నారు.

కౌలు రైతులకు విరివిగా రుణాలివ్వాలి

బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

కౌలు రైతులకు, టిడ్కో గృహాలకు, విద్యార్థులకు బ్యాంకర్లు విరివిగా రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి బ్యాంకర్లను కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో బ్యాంకర్లు డిసిసి, డిఎల్ఆర్‌సి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో 2022 డిసెంబర్ 31తో ముగిసిన త్రైమాసిక పురోగతిపై సమీక్షించారు. ఈ ఏడాది వార్షిక రుణప్రణాళిక లక్ష్యం రూ.22,398.98 కోట్లకు గాను, రూ.23,774.92కోట్లు రుణాలు అందించి, 106.14 శాతం సాధించినట్లు లీడ్‌బ్యాంక్ మేనేజర్ ఈదర రాంబాబు తెలిపారు. అలాగే ప్రాధాన్యతా రంగాల్లో రూ.16,391.39 కోట్లుకుగాను రూ.15,010.73కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.6,007.59 కోట్లకుగాను, రూ.8764.19 కోట్ల రుణాలు అందించినట్లు వివరించారు. వ్యవసాయ రంగానికి రూ.11,095.97 కోట్లకుగాను, 2022 డిసెంబర్ నాటికి రూ.8,368.19 కోట్లు అందించి 75.41 శాతం సాధించినట్లు చెప్పారు. యం.యస్.యం.ఇల క్రింద రూ.3,865.14 కోట్లకుగాను రూ.6,094.44 కోట్లు ఇచ్చాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా రుణాలు రూ.135.75 కోట్లు లక్ష్యంకాగా, రూ.87.50 కోట్లు మాత్రమే అందించారని, అలాగే హౌసింగ్ రుణాల క్రింద రూ.821.63 కోట్లకుగాను రూ.299.19 కోట్లు మాత్రమే అందించినట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 7630 మంది కౌలు రైతులకు రూ. 40.85 కోట్లు మాత్రమే రుణాలు అందించడం సరికాదన్నారు. హౌసింగ్ నిర్మాణ కార్యక్రమాలు జిల్లాలో భారీ ఎత్తున జరుగుతున్నాయని, అలాగే టిడ్కో గృహాలకు అందించాల్సిన రుణాలను బ్యాంకర్లు విరివిగా అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ప్రైమ్ మినిస్టర్ ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెస్సింగ్ ఎంటర్ ప్రైజెస్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఎనిమిది దరఖాస్తులను సోమవారంలోపు పరిష్కరించాలన్నారు. వచ్చే ఏడాదికి వంద కోట్ల రుణాలను కౌలు రైతులకు అందించే విధంగా లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. జిల్లాలో వ్యవసాయం అధికభాగం కౌలు రైతులే చేస్తున్నందున వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రెండింతల రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా కౌలు రైతులకు రుణాలు అందించడంలో దయార్ధ హృదయాన్ని చూపెట్టాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, నాబార్డ్ ఏజియం కార్తిక్ శాండిల్య, ఆర్బిఐ ఎల్‌డిఓ హనుమ కుమారి, యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా డిప్యూటీ రీజనల్ హెడ్ సుబ్రహ్మణ్యం వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కవలల మురిపెం

అత్యధికంగా నెహ్రూనికేతన్‌లోనే పది జతల కవలలు



నెహ్రూనికేతన్‌లో కవలలతో మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి

ప్రజాశక్తి -తెనాలి: విద్యావిదానంలో ఎన్నో ప్రత్యేకతలను సంతరించు కుంటున్న నెహ్రూ నికేతన్‌లో కవలల సంఖ్య కూడా అధికమేనని మేనేజింగ్ డైరెక్టర్ మురళీ కాంత్ దాసరి అన్నారు. అంతర్జాతీయ కవలల దినోత్సం సందర్భంగా బుధవారం పాఠశాల్లోని కవలలను ఒక వేదికపైకి చేర్చి గులాబీలతో వారిని అభినందించారు. ఈ సందర్భంగా మురళీకాంత్ మాట్లాడుతూ పాఠశాల్లో మొత్తం పది జతల కవలలున్నారని, ఎనిమిది జతలు పాఠశాలకు హాజరైనట్లు చెప్పారు. వారందరిని ఒక వేదికపై చూడటం విశేషంగా చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సత్యనారాయణ, అబ్దుల్ రజాక్‌లకు పురస్కారాలు అందచేస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, తదితరులు

సాహితీ సార్వభౌముడు నాగభైరవ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు

తెలుగు సాహిత్య రంగంలో దశాబ్దాల పాటు తన రచనా వైభవంతో వెలుగొంది అనేకమంది శిష్యులను తీర్చిదిద్దిన తెలుగు వినీలాకాశ సాహిత్య సార్వభౌముడు డాక్టర్ నాగ భైరవ కోటేశ్వరరావు అని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం, అన్నమయ్య కళావేదికపై జాతీయ కవి డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు కవితా వైభవం పేరుతో ఆయన స్మారక సాహిత్య పురస్కారాల సభ ఘనంగా నిర్వహించారు. పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ డాక్టర్ నాగభైరవ రచనలు కాలాతీత కాంతి రేఖలని, జాతీయత, ప్రాంతీయత, లౌకికవాదం, ప్రగతిశీలత అంతఃసూత్రంగా ప్రత్యేకత కలిగి ఉన్నాయని కొనియాడారు. సాహితీవేత్తలు డివియం సత్యనారాయణ అబ్దుల్ రజా హుస్సేన్‌లకు డాక్టర్ నాగ భైరవ సాహిత్య పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌యు విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు, ప్రముఖ సాహితీ వేత్త గాడేపల్లి దివాకర్ దత్తు, మోదుగుల రవికృష్ణ, శేట్లం చంద్రమోహన్ తదితరులు ప్రసంగించారు.

ఎస్ఎఫ్ఐ నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-గుంటూరు

నారాయణ కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలకు నిరసనగా 2015లో ఎస్ఎఫ్ఐ చేపట్టిన నిరసన కార్యక్రమం సందర్భంగా నాయకులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసును బుధవారం గుంటూరు జిల్లా 5వ అదనపు సివిల్ జడ్జి కోర్టు కొట్టివేసింది. నారాయణ కళాశాలలో వరుసగా విద్యార్థుల ఆత్మహత్యలు జరుగుతున్న నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని శాంతియుతంగా నిరసన తెలియజేసిన ఎస్ఎఫ్ఐ నాయకులుపై సెక్షన్ 143, 341, 188 కింద 12 మందిపై అక్రమ కేసులు బనాయించారు. ఈ కేసులపై ఎనిమిది సంవత్సరాల తర్వాత కోర్టు కొట్టివేసింది. న్యాయవాది గండికోట శేషగిరిరావు విద్యార్థి సంఘ నేతల పక్షాన వాదించి, ప్రజలకు ఎటువంటి ఆటంకం కలిగించకుండా నిరసన తెలిపే హక్కు ద్వారా మాత్రమే నిరసన తెలిపారు అన్నారు. ఈ కేసులో నాటి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి. భగవాన్ దాస్, బి.లక్ష్మణరావు, జిల్లా నాయకులు జ్యోతి, పవన్‌కుమార్, పి.శేషు, టి. రాజేష్, కాపుప్రశాంత్, ఎం.ధోనినాయక్, ఎల్ గోపి, జింకా నరేష్, బయ్యవరపు కార్తీక్, ఎస్.సతీష్‌చారి తదితరులు ఉన్నారు.



తీర్పు అనంతరం న్యాయవాదితో విద్యార్థి నాయకులు

51సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఆధార్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఎంపిక చేసిన 51 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సెంటర్ల ఏర్పాటుకు అసవరమైన కిట్స్ బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్యవరప్రసాదు, ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య సచివాలయ ఉద్యోగులకు అందించారు. ఈ సందర్భంగా ఆధార్ కేంద్రాలలో ఏర్పాటు చేసే ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయముల ద్వారా గ్రామాల్లోనే ప్రజలకు ఆధార్ సేవలు అందించటానికి ఇప్పటికే జిల్లాలో 62 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న 62 ఆధార్ సేవా కేంద్రాలకు అదనముగా క్రొత్తగా 51 గ్రామ సచివాలయములను ఆధార్ సంస్థ సేవలు అందించుటకు అనుమతి మంజూరు చేసి , కావలసిన పరికరములు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఎంపిక చేసిన ఆధార్ సేవా కేంద్రాలు రెండ్రోజుల్లోగా పనిచేయటం ప్రారంభం అవుతాయన్నారు.



మెగా చెక్కును లబ్ధిదారులకు అందిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

గుంటూరులో 166 మందికి లా నేస్తం

ప్రజాశక్తి-గుంటూరు

న్యాయవాద వృత్తిలో స్థిరపడాలనుకునే జూనియర్ న్యాయవాదులకు తొలి మూడేళ్ళలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ లానేస్తం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ న్యాయవాదులను ఆదుకుంటున్నారని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సిఎం జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్ లానేస్తం ద్వారా జూనియర్ న్యాయవాదులకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని వర్చువల్‌గా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గుంటూరు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, కిలారి వెంకట రోశయ్య, డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, జెసిరాజ కుమారి, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత మూడేళ్లలో 539 మంది జూనియర్ లాయర్లకు రూ.4,95,30,000 అందించటం జరిగిందని, ప్రస్తుత సంవత్సరంలో 166 మందికి అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెసి రాజకుమారి, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, అసిస్టెన్స్ కార్పోరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్‌పఠాన్, రాష్ట్ర కష్ణబలిజ, పూసల కార్పోరేషన్ చైర్‌పర్సన్ కొలా భవానీమణికంఠ పాల్గొన్నారు. డిఆర్ఒ కె.చంద్రశేఖరరావు, ఎన్ఆర్ఈడీసీ డైరక్టర్ కొత్త చిన్నపరెడ్డి, న్యాయవాది పోలూరి వెంకటరెడ్డి పాల్గొన్నారు.